సాక్షి
అనంతపురం
మంగళవారం । 14 । మే । 2024



రెచ్చిపోయిన పచ్చమూక

పోలింగ్ సందర్భంగా పచ్చమూకలు రెచ్చిపోయాయి. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశాయి. దాడులకూ తెగబడ్డాయి. 8లో



పలు మండలాల్లో వర్షం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ వాన పడింది. వాతావరణం చల్లబడింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.7°/22.3°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కూడా తగ్గింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.



అనంతపురం కేఎస్‌ఆర్ పాఠశాలలో సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్



బెళుగుప్ప మండలం కాలువ పల్లిలో ఓటేసేందుకు బారులు తీరిన ప్రజలు

● తాత.. స్ఫూర్తి ప్రదాత



కణేకల్లు మండలం మాల్యంలో ఓటు హక్కు వినియోగించుకున్న 105 ఏళ్ల మాబుసాబ్

ఓటెత్తిన చైతన్యం

- గంటల తరబడి బారులు తీరి మరీ ఓటు
- రాత్రి 9.30 వరకు క్యూలలోనే ఓటర్లు

అనంతపురం అర్బన్/అనంతపురం అగ్రికల్చర్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు పోటెత్తారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏ నియోజకవర్గం వెళ్లినా.. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా ఓటర్లు బారులు తీరిన దృశ్యాలే కనిపించాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. కానీ నిర్ణీత సమయంలోపు క్యూలో ఉన్న ఓటర్లను రాత్రి ఎంత సమయమైనా ఓటింగ్‌కు అనుమతించారు. రాత్రి 9.30 గంటల వరకు అధికారికంగా అందిన సమాచారం ప్రకారం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 76.60 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ పూర్తయితే ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2019 ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 80.80 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లోనూ దాదాపు అదే శాతం నమోదయ్యే అవకాశం ఉంది.

ఆహ్లాదకరమైన వాతావరణంలో..

సరిగ్గా పోలింగ్ రోజున ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడడంతో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. రెండు నెలలుగా 42 నుంచి 45 డిగ్రీలతో సూరీడు సెగలు పుట్టించిన విషయం తెలిసిందే. ఉదయం 10 గంటలకు కూడా బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తిపోయేవారు. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రతతో రెండు నెలలుగా జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ క్రమంలో పోలింగ్ రోజు ఓటు వేయడానికి జనం రారని అందరూ భావించారు. అలాంటిది సరిగ్గా పోలింగ్ రోజునే చిరుజల్లుల నడుమ చల్లటి వాతావరణం నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో పోలింగ్ స్టేషన్లకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు జనం తగ్గలేదు.

పోలింగ్ తీరును పరిశీలించిన కలెక్టర్

పోలింగ్ తీరును కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. తాడిపత్రిలో చోటు చేసుకున్న ఘటనలను ఆయన తీవ్రంగా పరిగణించారు. ఎస్పీ అమిత్ బర్దర్‌ను అక్కడికి పంపించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టామన్నారు.

రాత్రి 9.30 గంటలకు
అందిన సమాచారం ప్రకారం

నియోజకవర్గం	పోలింగ్ శాతం
రాయదుర్గం	77.60
ఉరవకొండ	80.40
గుంతకల్లు	71.56
తాడిపత్రి	77.58
శింగనమల	80.13
అనంతపురం	64.50
కళ్యాణదుర్గం	79.40
రాప్తాడు	81.41
మొత్తం	76.60






ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి







సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థులు వై. వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తలారి రంగయ్య, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వీరాంజనేయులు

కదిలొచ్చిన మహిళాలోకం...

● వృద్ధులు, యువత కూడా ● చల్లని 'గాలి'కి సంకేతమే(నా)!

సాక్షి,అనంతపురం: ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గంటల తరబడి క్యూలలో ఓపిగ్గా వేచి ఉండి మరీ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. వృద్ధులు, యువత కూడా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం కనిపించింది.

'గాలి' ప్రచండమే(నా)..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారు. అన్ని పథకాల్లోనూ అగ్ర తాంబూలం ఇచ్చారు. నామినేటెడ్ పదవులనూ అక్కచెల్లెమ్మలకే పెద్ద సంఖ్యలో కట్టబెట్టారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో అండగా నిలిచారు. దీంతో పాటు బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు అందేలా చర్యలు తీసుకుని చేయూత అందించారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని కుచ్చుటోపీ పెడితే, జగన్ అధికారంలోకి వచ్చాక రుణాలు మాఫీ చేసి మాట నిలుపుకున్నారు. అక్కచెల్లెమ్మలకు సంతోషం పంచారు. మహిళా పక్షపాతిగా నిలిచి జేజేలు అందుకున్నారు. అలాగే, వృద్ధులకు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా పెన్షన్ మొత్తాన్ని పెంచి, వలంటీర్ల ద్వారా వారి ఇంటి వద్దకే వెళ్లి డబ్బు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే జరిగిన ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వినియోగించుకోవడం చూస్తే 'ఫ్యాను' గాలి బలంగా వీచే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



కంబదూరు మండలం తిమ్మాపురంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న మహిళలు



కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేసిన శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి






ఓటు హక్కు వినియోగించుకున్న నటి సుమయరెడ్డి, ఓటు వేసిన యువత, ఓటు వేసిన ఆనందంలో ఓ అవ్వ, ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

పోలింగ్‌కు సహకరించిన అందరికీ ధన్యవాదాలు

అనంతపురం అర్బన్: జిల్లాలో పోలింగ్ విజయవంతంగా ముగిసిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. ఇందుకు సహకరించిన ఎన్నికల కమిషన్ పరిశీలకులు, అధికారులు, సిబ్బందికి జిల్లా యంత్రాంగం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. పోలింగ్ నిర్వహణలో భాగస్వాములైన రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఏఆర్‌ఓలు, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీఓలు, ఓపీఓలు, కేంద్ర బలగాలు, నిఘా స్క్వాడ్లు, రూట్ అధికారులు, ఎన్ఎస్ఎస్, మాజీ సైనికులు, ఎన్‌సీసీ, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానన్నారు.

పెద్దారెడ్డి లక్ష్యంగానే దాడి!

- ముందస్తుగానే రాళ్లు సిద్ధంగా ఉంచుకున్న 'పచ్చ' మూక
- ఎమ్మెల్యే వెళ్లిన చోటల్లా రెచ్చిపోయిన వైనం



తాడిపత్రి ఓంశాంతి నగర్‌లో జేసీ వర్గీయులు రువ్విన రాళ్లు



జేసీ వర్గీయుల రాళ్ల దాడిలో ధ్వంసమైన ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి వాహనం



ఎమ్మెల్యే పెద్దారెడ్డితో మాట్లాడుతున్న ఎస్పీ

తాడిపత్రి: తమ రాజకీయ ఆధిపత్యాన్ని సవాల్ చేసి, ప్రజామద్దతుతో రోజురోజుకు బలపడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగానే జేసీ మూక దాడులకు పథకం రచించిందా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. పక్కా ప్రణాళిక ప్రకారమే పచ్చ దండు రాళ్ల దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. వివరాలు.. తాడిపత్రి పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చారు. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, పచ్చ బ్యాచ్‌తో కలిసి ఓంశాంతి నగర్ ముఖద్వారం వద్ద కాపు కాశారు. అయితే, వారిని గమనించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన వాహనాలను ముఖద్వారం వద్దనే ఆపి, నడుచుకుంటూ పోలింగ్ కేంద్రం వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలోనే పచ్చ బ్యాచ్‌లోని ఒకడు అస్మిత్ రెడ్డి కారులోని ఫుట్ మ్యాట్ తీసి ఎమ్మెల్యేపైకి విసిరాడు. వెంటనే అప్రమత్తమైన వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేకు అడ్డుగా నిలవడంతో మ్యాట్ వారికి తగిలింది. అంతటితో ఆగని పచ్చ గూండాలు ముందుగా రచించిన పథకం ప్రకారం తమ వెంట తెచ్చుకున్న రాళ్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపైకి విసిరారు. తండ్రిపై దాడి జరుగుతోందన్న విషయం తెలుసుకున్న హర్షవర్ధన్‌రెడ్డి అక్కడికి రాగా, అతనిపై కూడా రాళ్లు రువ్వారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి వాహన అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అమిత్ బర్దర్ సంఘటనా స్థలానికి చేరుకోగా, ఎస్పీ సాక్షిగానే మరింత రెచ్చిపోయారు. ఎస్పీ కూడా త్రుటిలో పచ్చ రౌడీల రాళ్ల దాడి నుంచి తప్పించుకున్నారు. ఆయనకు రక్షణగా నిలిచిన ఓ ఏఆర్ కానిస్టేబుల్‌కు రాళ్లు తగిలి గాయపడ్డాడు. కాగా, అంతకుముందు టైలర్స్ కాలనీలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో కూడా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై రాళ్లతో పచ్చపార్టీ నాయకులు దాడులు చేశారు. మెయిన్ బజార్ వీధిలోనూ ఎమ్మెల్యే వాహనంపై రాళ్లదాడికి దిగారు. జరిగిన సంఘటనలను గమనిస్తే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని హతమార్చడమే లక్ష్యంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి పచ్చ మూకతో కలసి ప్రణాళిక రచించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఆయా ఘటనలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంత దారుణంగా ఎమ్మెల్యేపైనే రాళ్ల దాడులకు దిగిన టీడీపీ నాయకుల వైఖరిపై పట్టణ ప్రజల్లో ఆందోళన నెలకొంది.



కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఓటమి భయంతోనే నాపై రాళ్ల దాడి

- జేసీ ప్రభాకర్ రెడ్డికి సహకరించిన ఏఎస్పీ రామకృష్ణ
- ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడాన్ని ఓర్వలేకనే దుశ్చర్యలు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం

తాడిపత్రి రూరల్: ఓటమి భయంతోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై రాళ్ల దాడులు చేయించాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే పోలింగ్ స్టేషన్ సమీపంలోని ఇళ్లపై నుంచి టీడీపీ గూండాలతో దాడులు చేయించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి తాడిపత్రి పట్టణంలో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, తాడిపత్రిలో జేసీల అరాచకాలను అరికట్టి ప్రశాంతతను నెలకొల్పినందుకు ఓటు ద్వారా ధన్యవాదాలు తెలిపేందుకు పెద్ద ఎత్తున ఓటర్లు తరలివచ్చారన్నారు. మహిళలు, వృద్ధులు, మైనార్టీలు ఎక్కువ శాతం ఓటు వేయడానికి రావడంతో ఓటమి తప్పదని జేసీ ప్రభాకర్ రెడ్డి గ్రహించాడన్నారు. ఇన్నాళ్లు తాడిపత్రి ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకున్న జేసీ.. నేడు వారు స్వేచ్ఛగా వచ్చి ఓట్లు వేస్తుండడం సహించలేకపోతున్నాడన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి లబ్ధి పొందేందుకు దాడులకు తెగబడ్డారన్నారు. వీరికి పోలీసు అధికారులు కూడా సహకరించారని ఆరోపించారు. ఏఎస్పీ రామకృష్ణ జేసీకి వత్తాసు పలికారని, దాడులు జరగడానికి ప్రధాన కారణంగా నిలిచారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో స్పెషల్ పార్టీ పోలీసు జమాల్‌బాషతో పాటు పలువురికి గాయాలయ్యాయన్నారు. దుశ్చర్యలకు పాల్పడింది కాక, ఎమ్మెల్యే వర్గీయులే దాడులు చేశారని చిత్రీకరిస్తున్నాడని విమర్శించారు. 'జేసీ అరాచకాల గురించి నియోజకవర్గవాసులకే కాదు జిల్లాప్రజలందరికీ తెలుసు. దాడులకు తెగబడితే నా ఆత్మ విశ్వాసం సన్నగిల్లుతుందని భ్రమపడ్డాడు. నేను భయపడి ఇంట్లో పడుకుంటే పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడవచ్చనే దుష్ట పన్నాగం పన్నాడు. కానీ నేను భయపడతానో లేదో ప్రజలందరి కంటే జేసీ ప్రభాకర్‌కే బాగా తెలుసు. నేను ఏం చేస్తానో అని కలలో కూడా ఆయన ఆలోచిస్తూ ఉంటాడు. జేసీ సోదరుల దాష్టీకాలతో అవస్థలు పడ్డారు కాబట్టే గతంలో ఎన్నడూ లేని విధంగా నాకు మద్దతు తెలిపేందుకు ఓటర్లు తరలివచ్చారు. నాకు దేవుడి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. జూన్ 4న ఆ విషయం వెల్లడవుతుంది. ఎన్నికల ఫలితాల తరువాత అన్ని విషయాలు మాట్లాడుతా' అని ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు

అనంతపురం అర్బన్: పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నాయి. జేఎన్‌టీయూ కళాశాలలో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు నియోజకవర్గానికి ఒక స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఈవీఎంలను పీఓ ద్వారా స్వాధీనం చేసుకునేందుకు నియోజకవర్గానికి ఒక రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల పీఓలు నియోజకవర్గ రిసెప్షన్ కౌంటర్‌లో నిర్దేశించిన ఫారాలను భర్తీ చేసి ఈవీఎంలను అప్పగించారు. పోలింగ్ సిబ్బందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ విధులు నిర్వర్తించే అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు.



జేఎన్‌టీయూలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

క్లుప్తంగా

ఓట్ల పండుగ... రంగవల్లుల ముచ్చట



కేఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు స్వాగతం పలుకుతూ రంగవల్లి

అనంతపురం అర్బన్: ఏడు నెలల ముందుగానే జిల్లాలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగకు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన జిల్లా వాసులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణాలు, గ్రామాల్లో సందడి నెలకొంది. కనువిందు చేసే ముగ్గులతో ఓటర్లకు స్వాగతం పలుకుతూ జిల్లా అధికారులు సైతం ఈ సారి వైవిధ్యాన్ని కనబరిచారు. ఇప్పటికే జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఆలోచనతో జిల్లాకు ప్రత్యేకంగా ఎన్నికల మస్కట్‌ను రూపొందించిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచన మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద పండుగ వాతావరణాన్ని కల్పించారు. జిల్లా వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద రంగవల్లులతో ఆకట్టుకున్నారు. నగరంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ప్రవేశ మార్గం వద్ద 'ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్' అంటూ వేసిన రంగవల్లి చూపరులను ఆకట్టుకుంది.

పలు మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. దీంతో వేసవి తాపం బాగా తగ్గిపోయింది. రాయదుర్గం, గుడిబండ, కళ్యాణదుర్గం, మడకశిర, గుంతకల్లులో 30 నుంచి 40 మి.మీ, ఉరవకొండ, బ్రహ్మసముద్రం, కంబదూరు, వజ్రకరూరు, కదిరిలో 20 నుంచి 25 మి.మీ, డి.హీరేహాళ్, కణేకల్లు, యాడికి, ఆత్మకూరు, బుక్కపట్నం, తలుపుల, అమరాపురం, కనగానపల్లి, ముదిగుబ్బ తదితర మండలాల్లో 10 మి.మీ పైగా వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అస్మిత్ హౌస్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న ఉద్రిక్తతల కారణంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు హర్షవర్దన్‌రెడ్డి, సాయిప్రతాపరెడ్డిని వారి నివాసంలోనే పోలీసులు నిర్బంధించారు. అలాగే టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి, సోదరుడు జేసీ పవన్, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిలనూ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత వీరిని విడిచిపెట్టారు.

రెచ్చిపోయిన 'పచ్చ'మూక

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సజావుగా సాగుతున్న సమయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయారు. ఓటమి భయంతో ఆక్రోశంతో రగిలి పోయారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ విధ్వంసాలకు తెగబడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇదే పరిస్థితి కన్పించింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటు వేస్తున్నారన్న భావనతో అక్కసు వెళ్లగక్కారు. పోలింగ్ నిలుపుదలకు కుట్రలు సాగించారు. టీడీపీ నేతల దాష్టీకాలను వైఎస్సార్‌సీపీ అండతో ప్రజలు సమర్థవంతంగా తిప్పి కొట్టారు.


గుత్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడుతున్న దృశ్యం

చోళసముద్రంలో బరితెగింపు


చోళసముద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను చుట్టుముట్టి దాడి చేస్తున్న టీడీపీ నేతలు

లేపాక్షి: హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం చోళసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నేతలు బరితెగించారు. సోమవారం సాయంత్రం స్థానిక టీడీపీ నేత, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మధ్య చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. దీంతో టీడీపీ నేతలు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తని చుట్టుముట్టి దాడి చేశారు. అక్కడున్న స్థానికులు జోక్యం చేసుకోవడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి వెంటనే ఆయన అక్కడకు చేరుకున్నారు. ఘటనపై ఆరా తీస్తుండగా మరోసారి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. సకాలంలో పోలీసులు రంగంలో దిగి లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు.

రెక్కమానులో రచ్చ

గాండ్లపెంట: కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం రెక్కమాను పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం మధ్యాహ్నం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. 174వ పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 1,445 మంది ఓటర్లు ఉండగా, మధ్యాహ్నం 2 గంటల సమయానికి 600 ఓట్లు పోలయ్యాయి. అయితే వైఎస్సార్‌సీపీకి ఎక్కువగా ఓట్లు పడుతున్నాయనే ఉద్దేశంతో మధ్యాహ్నం 2.30 గంటలకు పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలు రచ్చరచ్చ చేశారు. సముదాయించబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారు. దీంతో స్వీయ రక్షణలో భాగంగా ప్రతి దాడులు చోటు చేసుకున్నాయి. ఒకరికి రక్తగాయాలయ్యాయి.


వైఎస్సార్‌సీపీ వర్గీయులతో ఘర్షణ పడుతున్న టీడీపీ వర్గీయులు

దివ్యాంగుడిపై ఇనుప రాడ్‌తో దాడి


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ఆదినారాయణ

పెద్దవడుగూరు: తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా సోమవారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే మిడుతూరు, పి.వీరన్నపల్లి, దిమ్మగుడి తదితర గ్రామాల్లో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మిడుతూరు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. వీరన్నపల్లిలో ఓటర్లను టీడీపీ నేతలు ప్రభావితం చేస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. దిమ్మగుడిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఆదినారాయణ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఏర్పాటు చేసిన వాటర్ క్యాన్‌లను మారుస్తుండగా టీడీపీ నాయకులు రామిరెడ్డి, రాజారెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి కులం పేరుతో దూషణలకు దిగారు. దివ్యాంగుడైన ఆదినారాయణను బండిపై నుంచి కిందకు తోసేశారు. అంతలో అక్కడికి చేరుకున్న టీడీపీ కార్యకర్తలు నగేష్, రాజు, మల్లికార్జున, ఓబులేసు అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ఇనుపరాడ్లతో దాడి చేయడంతో ఆదినారాయణ తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు పరుగున వస్తుండడం గమనించిన దౌర్జన్యపరులు అక్కడి నుండి పరారయ్యారు. క్షతగాత్రున్ని స్థానికులు చికిత్స నిమిత్తం పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు.

తనకల్లులో మూకుమ్మడి దాడి



టీడీపీ వర్గీయుల దాడిలో ధ్వంసమైన కారు

తనకల్లు: కదిరి నియోజకవర్గం తనకల్లు పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపల్లిలో 1,110 ఓటర్లు కలిగిన 255వ పోలింగ్ కేంద్రం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు ఉద్రిక్తత నెలకొంది. రాచువారిపల్లికి చెందిన ఓటరు దేశాయి గౌతంరెడ్డి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. ఆ సమయంలో క్యూలైన్ అడ్డదిడ్డంగా ఉండడంతో సక్రమంగా వెళ్లాలని ఆయన సూచించారు. అయితే అప్పటికే ఓటమి భయంతో చిరాకుతో ఉన్న టీడీపీ నాయకులు... గౌతంరెడ్డిపై మూకుమ్మడిగా కలబడ్డారు. మా ఊళ్లోకి వచ్చి నీవెవరు చెప్పడానికంటూ చేతికి అందిన రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డారు. దాడిలో గౌతంరెడ్డి కారు ధ్వంసమైంది.ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓబుళాపురంలో కర్రలతో దాడి


గాయపడిన పూజారి కృష్ణయ్య

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామ ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే అధికంగా రావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. మూకుమ్మడిగా కర్రలతో దాడికి తెగబడడంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పూజారి కృష్ణయ్య, వెంకటకృష్ణ, రమణ, సుధాకర్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కృష్ణయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ మూకల హల్‌చల్

కళ్యాణదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ మూకలు హల్‌చల్ చేశాయి. ఉదయం నుంచి టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అనుచరులు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చక్కర్లు కొట్టారు. ఉరవకొండ, అనంతపురం నుండి వచ్చిన పచ్చ మూకలు, బౌన్సర్లు ఎలాంటి పాస్ లేకుండానే పోలింగ్ కేంద్రాల్లోకి చొచ్చుకెళ్లి ఓటర్లను ప్రభావితం చేశారు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను భయభ్రాంతాలకు గురి చేశారు.


వేపులపర్తి పోలింగ్ బూత్‌లోకి చొరబడుతున్న అమిలినేని కుటుంబసభ్యులు

కోనుప్పలపాడులో రాళ్లతో దాడి

యాడికి: మండలంలోని కోనుప్పలపాడులో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నేతలు రాళ్లతో దాడి చేశారు. ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎక్కువగా ఓటింగ్‌కు వస్తుండడం గమనించిన టీడీపీ సర్పంచ్ లక్ష్మీదేవి భర్త రామాంజనేయులు కుట్రలకు తెరలేపాడు. అదే గ్రామానికి చెందిన జేసీ ప్రధాన అనుచరుడు, టీడీపీ నేత చవ్వా గోపాల్‌రెడ్డి ద్వారా నంద్యాల జిల్లా బూరుగుల గ్రామానికి చెందిన పది మంది అనుచరులను ఆటోలో రప్పించుకుని రిగ్గింగ్‌కు ఎత్తుగడ వేశారు. విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ నేత బాలగంగయ్య, తన అనుచరులతో కలసి వారిని అడ్డుకున్నారు. అప్పటికే రాళ్లు, కర్రలతో సిద్ధంగా ఉన్న చవ్వా గోపాల్‌రెడ్డి అనుచరులు 70 మంది ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ఘటనలో గంపిరెడ్డి, మంగల చంద్ర, బాలకృష్ణతో పాటు ఇంటి బయట కూర్చొని ఉన్న కోనా వెంకటశివారెడ్డి తల్లి కోనా వెంకటనారాయణమ్మపై రాళ్లు పడడంతో తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందారెడ్డి కోనుప్పలపాడుకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.


వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్లతో దాడి చేస్తున్న దృశ్యం

యర్రగుంటలో ఏజెంట్‌పై దాడి

కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం యర్రగుంట పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీకి అత్యధికంగా ఓట్లు పోలవుతున్నాయన్న అక్కసుతో ఆ పార్టీ ఏజెంట్ కేవీ మంజునాథ్‌పై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఉదయం నుంచి వరుసగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఎక్కువగా ఓటింగ్‌కు వచ్చారు. విషయాన్ని గమనించిన టీడీపీ నేత ఆనంద్‌కుమార్ ఎలాంటి పాస్ లేకుండానే పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకెళ్లాడు. ఆ సమయంలో అభ్యంతరం తెలిపిన మంజునాథ్‌ను దుర్భాషలాడుతూ కేంద్రం నుంచి బయటకు లాక్కొచ్చాడు. అనంతరం అక్కడే ఉన్న టీడీపీ నాయకులు యశోదప్ప, అజయ్, రఘు, గౌసి, లక్ష్మన్న, రంగస్వామి, రాజప్పతో కలసి మంజునాథ్‌పై మూకుమ్మడి దాడి చేశారు. రోడ్డు పక్కన ఉన్న డ్రైయినేజీలోకి పడేసి తొక్కారు. గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడికి చేరుకునేసరికి పారిపోయారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు ప్రత్యేక పోలీసు బలగాలను పంపించారు. బాధితుడిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పరామర్శించారు.

వ్యక్తి దుర్మరణం

రాయదుర్గం టౌన్: స్థానిక బీటీపీ రోడ్డు హౌసింగ్ లే అవుట్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో హోటల్ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామానికి చెందిన రాజు (35), హోటల్ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గర్భిణి అయిన భార్యకు రాయదుర్గంలో వైద్య పరీక్షలు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యతో పాటు నాలుగేళ్ల వయసున్న కుమారుడు చరణ్‌ను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరాడు. హౌసింగ్ లే అవుట్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయమై రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన భార్య, కుమారుడిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి చేర్చారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటు వేసేందుకు వెళుతూ మృత్యు ఒడికి

గౌరిబిదనూరు: ఏపీలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామానికి వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు... హిందూపురం తాలూకా సంతేబిదనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు వెంకటేశు (35) బెంగళూరులో నివాసం ఉంటున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన అర్ధరాత్రి గౌరిబిదనూరు తాలూకాలోని కామలాపురం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. ఘటనలో వెంకటేశు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మంచేనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు

కూడేరు: ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు అజయ్‌నాథ్ ఝా సోమవారం ఉదయం కూడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ సరళిపై సిబ్బందిని ఆరా తీశారు. గుంపులు గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశించారు.


హెల్ప్‌డెస్క్ సిబ్బందితో మాట్లాడుతున్న అజయ్‌నాథ్ ఝా




కళ్యాణదుర్గంలో ఓటు వేయడానికి తరలివచ్చిన ఓటర్లు, రాయదుర్గంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వర్షపునీటిలోనే ఓటు కోసం నిల్చున్న దృశ్యం, పోలింగ్ సందర్భంగా అనంతపురంలో బోసిపోయిన సుభాష్ రోడ్డు

ఉత్సాహంగా ఓటింగ్..


అనంతపురంలో ఓటు వేసేందుకు బైక్‌పై వస్తున్న దంపతులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు నెలలపాటు నిప్పులు కురిపించిన సూరీడు శాంతించాడు. వాతావరణం చల్లగా మారింది. ఐదేళ్లకొకసారి వచ్చే అతిపెద్ద ఎన్నికల పండుగకు ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం ఆరుగంటల నుంచే పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేశారు. ఈసారి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, నూతన ఓటర్లు, సాధారణ ఓటర్లు అందరూ బాధ్యతగా కదిలారు. ఊతకర్ర చేతపట్టి కొందరు.. శక్తిని కూడదీసుకుని ఇతరుల సహాయంతో మరికొందరు.. వీల్‌చైర్లు.. మూడుచక్రాల సైకిళ్లపై ఇంకొందరు.. ఇలా ప్రతి ఒక్కరూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా కదిలొచ్చారు. ఓటు విలువను గుర్తెరిగి మన భవిష్యత్తుకు భరోసా ఇచ్చే వారు ఎవరో నిర్ణయించుకుని ఓటు వేశారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా తమ మదిలో ముద్రితమైన అభ్యర్థి–పార్టీకి ఈవీఎంపై బటన్ నొక్కారు. – సాక్షి బృందం


అనంతపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు


ఉరవకొండ మండలం వై.రాంపురం పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు


ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతంగా పోలింగ్

గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకే ఓటర్లు బారులు తీరారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. కొన్ని కేంద్రాల్లో 6.00 గంటలకు పోలింగ్ ముగియగా, మరి కొన్ని కేంద్రాల్లో 6 గంటల వరకూ క్యూలైన్‌లో నిలిచి ఉన్న ఓటర్లకు ఓటు వేసుకునే అవకాశం కల్పించడంతో రాత్రి 8.30 గంటల వరకూ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు
- రెండు బూత్‌లలో మొరాయించిన ఈవీఎంలు


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వైవీఆర్


పామిడిలో ఓటుహక్కును వినియోగించుకున్న ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీఛైర్మన్ ఎం వీరా, ఆయన సతీమణి కవిత


గుంతకల్లులో ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గంలో చెదురు మదురు ఘటనలు మినహా అసెంబ్లీ ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి అయ్యేవరకు కొనసాగింది. ఇక గుత్తి కోటలోని ఏర్పాటు చేసిన కోట హైస్కూల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో రాత్రి 9.30 గంటలకు పైగా పోలింగ్ కొనసాగినట్లు తెలిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా రాత్రి 9.00 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం 76.84 శాతం పోలింగ్ నమోదైంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డితోపాటు ఇతర ప్రధాన పార్టీ నాయకులు గెలుపు కోసం పోలింగ్ ముగిసే సమయం వరకు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈ ఎన్నికల్లో యువత ఉత్సాహం ఓటింగ్‌లో పాల్గొనడంతో ఓటింగ్ శాతం బాగా నమోదైంది. కాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఉదయం 7.00 గంటల నుంచే ఓటర్లు క్యూలైన్‌ల్లో భారీగా పెరిగిపోయాయి, కొన్ని పోలింగ్ కేంద్రాల్లో దాదపు రెండు గంటలకు పైగా క్యూలైన్ నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏసీఎస్ మిల్ హైస్కూల్‌లోని 113, 114, అంబేడ్కర్ నగర్‌లోని 128,129, 130, 131 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు భారీ ఎత్తున క్యూ కట్టారు.

మొరాయించిన ఈవీఎంలు

గుంతకల్లు పట్టణంలో పీడబ్ల్యూ కార్యాలయంలోని 115, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 97వ పోలింగ్ స్టేషన్లలోని ఈవీఎంలు మొరాయించాయి. దీంతో దాదాపు అర గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు విసుక్కున్నారు. అధికారులు ఈవీఎంలను మార్చి పోలింగ్‌ను ప్రారంభించారు. ఇక టీడీపీ మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ కవ్వింపు చర్యలు కారణంగా పీడబ్ల్యూ కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చేటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని తరిమికొట్టారు. ఇదిలాఉండంగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో వీల్ ఛైర్ సమయానికి లేకపోవడంతో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి ఎత్తుకు వచ్చి ఓటు వేయించిన సంఘటన చోటు చేసుకుంది. పోలింగ్ అనంతరం ఈవీఎంలను పోలీసు బందోబస్తు నడుమ అనంతపురంలోని జేఎన్‌టీయూ కళాశాల తరలించారు.

గుంతకల్లుటౌన్: గుంతకల్లు పట్టణ ఓటర్లల్లో చైతన్యం వెల్లివిరిసింది. వజ్రాయుధమైన ఓటును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద జనం క్యూ కట్టారు. నడవలేని వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక వీల్ ఛైర్‌లను ఏర్పాటు చేశారు. కాగా పట్టణంలోని సర్ధార్‌వల్లభాయ్ పటేల్, అంబేద్కర్ మున్సిపల్ స్కూల్స్‌లోని పోలింగ్ కేంద్రాల్లో 6 గంటల్లోపు క్యూలో ఉన్న వారికి అధికారులు టోకెన్లు జారీ చేసి పోలింగ్‌కు అనుమతిచ్చారు.

మొరాయించిన ఈవీఎం

పట్టణంలోని అంబేద్కర్‌నగర్ 128 పీఎస్‌లో ఈవీఎం మొరాయించింది. దీంతో 10 నిమిషాల పాటు పోలింగ్ నిలిపివేశారు. తిరిగి యథావిధిగా పోలింగ్ నిర్వహించారు. అలాగే పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్‌లో 52వ పీఎస్‌లో ఆయా పార్టీల తరపు ఏజెంట్లు ఆలస్యంగా రావడంతో ఉదయం 20 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని కసాపురం, కొంగనపల్లి, పాతకొత్తచెరువు, నాగసముద్రం, వైటీ.చెరువు తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది.

కసాపురంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

సమస్యాత్మక గ్రామం కసాపురంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వికలాంగులు, అనారోగ్యంతో మంచం పట్టిన ఓటర్లను తీసుకువచ్చి ఓటు వేయిస్తున్నారనే కారణంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఇరు వర్గాలకు సర్దిచెప్పి పరిస్థితి సద్దుమణిగించారు.

గుత్తి: గుత్తిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సీఎస్‌ఐ చర్చి(బాహార్ పేట), కోట, ఎంఎస్ డిగ్రీ, ఎంఎస్ జూనియర్ కాలేజీ, గుత్తి ఆర్‌ఎస్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. గంటల కొద్దీ క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. గుత్తి మున్సిపాలిటీలో మొత్తం 38,661 ఓటర్లు ఉన్నారు. ఆరు గంటలకు సుమారు 70 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

గుత్తి రూరల్: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభం కావడంతో ఓట్లు వేసేందుకు ఓటర్లు భారీగా తరలివచ్చారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పోటా పోటీగా ఓటర్లను తరలించి ఓట్లు వేయించారు. టి.కొత్తపల్లి, అబ్బేదొడ్డి, మాముడూరు, ఇసురాళ్ళపల్లి, గాజులపల్లి, తొండపాడు, బసినేపల్లితో పాటు ఇతర గ్రామాల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి ఓటర్లు తరలివచ్చారు. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అన్ని పార్టీల నాయకులు, పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బేతాపల్లి, తొండపాడు గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ జరగడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

ఉదయం ఏడు గంటలకే బారులు

పామిడి: పామిడిలో సోమవారం సార్వతిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకే పోలింగ్‌కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పామిడిలోని ఒకటో వార్డుల్లోని ఓ పోలింగ్ కేంద్రం, పాళ్యంలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు గంటపాటు మొరాయించాయి. ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు నడుమ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలవ్యాప్తంగా 78.80 శాతం పోలింగ్ నమోదైంది.


గుంతకల్లు మండలం నక్కనదొడ్డిలో ఉదయం 9 గంటలకే బారులు తీరిన ఓటర్లు


గుత్తి బాహార్ పేట పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన వృద్ధురాలు


గుంతకల్లులో ఓటు వేయడానికి చంటి బిడ్డతో వస్తున్న బాలింత


గుంతకల్లులో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు


గుత్తి సీఎస్‌ఐ చర్చి వద్ద బారులు తీరిన ఓటర్లు


పామిడిలో క్యూ కట్టిన ఓటరు


గుంతకల్లులో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్కూల్ పీఎస్‌లో ఓటర్లు

అడిగేదెవరు...ఆపేదెవరు?

- కోడ్‌ను ఖాతరు చేయని టీడీపీ నాయకులు
- పీఎస్‌ల్లోకి గుమ్మనూరు వెంట అనుచరులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. పోలింగ్ రోజు రాజకీయ పక్షాలు, అభ్యర్థులు పాటించాల్సిన నియమ, నిబంధనలను వారు తుంగలో తొక్కారు. సోమవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ వెంట ఆ పార్టీ నాయకులు, అతని అనుచరులు గుంపులుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. గుమ్మనూరు జయరామ్ తాను ప్రయాణించే వాహనంతో పాటు ఎన్నికల అధికారుల అనుమతి లేని ఐదారు వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు కాన్వాయ్‌గా తిరుగుతూ హల్‌చల్ చేశారు. 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ వారు ఖాతరు చేయలేదు. తమను అడిగేదెవరు..ఆపేదెవరన్నట్టు వ్యవహరించారు. పట్టణంలో ఎక్కడ చూసినా కర్ణాటకకు చెందిన వాహనాలు, వ్యక్తులు చక్కర్లు కొట్టినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారని ప్రజలు బాహాటంగా చర్చించుకున్నారు.


పీఎస్ ఆవరణలో జయరామ్‌తో కలిసి గుంపుగా తిరుగుతున్న టీడీపీ నాయకులు


చందమామ స్కూల్‌లోని పీఎస్‌లో టీడీపీ అభ్యర్థి జయరామ్,అతని అనుచరులు

వెంకటాంపల్లి పెద్దతండాలో ఉద్రిక్తత

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండాలో సోమవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. స్థానిక పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్నవారందరికి ఓటు వేసేందుకు అధికారులు స్లిప్పులు అందించారు. అదే సమయంలో గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు తమకు కూడా ఓటు వేసేందుకు స్లిప్పులు ఇవ్వాలని అక్కడున్న అధికారులతో వాదనకు దిగారు. సమయం ముగిసినందున స్పిప్పులు ఇవ్వడం కుదరదని అధికారులు చెప్పడంతో.. స్లిప్పులు ఇచ్చేంత వరకూ ఇక్కడినుంచి వెళ్లేది లేదని పట్టుబట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా, వారి మాట వినలేదు. పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఎస్‌ఐ నరేష్, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ఉరవకొండలో సార్వత్రిక పోలింగ్ ప్రశాంతం


ఎర్రగుడిలో బారులు తీరిన మహిళా ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకున్న యువనేత ప్రణయ్‌రెడ్డి


వజ్రకరూరు మండలం గూళ్యపాలెంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఉరవకొండ: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులుదీరి, ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- మండల పరిధిలోని ఇంద్రావతిలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురి చేస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో కొంత ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది.
- మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన వై.రాంపురం పోలింగ్ బూత్‌లో ఓటరును మభ్యపెట్టి, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని టీడీపీ నాయకులు చెప్పడంతో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్‌గా ఉన్న సీపీ వీరన్న అడ్డుకున్నాడు. సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని ఎలా చెప్తారని నిలదీశాడు. దీంతో కొంత వాగ్వాదం జరిగింది. దీంతో అరగంట వరకు పోలింగ్‌ను అధికారులు నిలిపివేశారు. అనంతరం టీడీపీ నాయకులను బయటకు పంపడంతో పోలింగ్ కొనసాగింది.
- వైరాంపురం పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఓ హత్య కేసులో ముద్దాయిని కూర్చోబెట్టి, ఓటర్లను బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి ఆర్‌ఓ కేతన్ గార్గ్‌కు ఫిర్యాదు చేశారు.
- ఉరవకొండలోని ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఉపసర్పంచ్ వన్నప్ప, వేమన్న తదితరులపై దౌర్జన్యానికి దిగారు.దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు ఇరువర్గాలను శాంతింప చేశారు.
- ఉరవకొండలోని పాతమార్కెట్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పయ్యావుల శ్రీనివాసులు తన అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో వెంటనే యువనేత ప్రణయ్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నేత శీనప్ప, ఇతర నాయకులు బయటకు వెళ్లిపోవడంతో సమస్య సద్దుమణిగింది.
- లత్తవరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 154వ బూత్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు కొడిగి గోవిందుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడికి యత్నించారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు ఎక్కువగా పడుతున్నాయన్న అక్కసుతో అల్లర్లు సృష్టించడానికి యత్నించాడు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు.

రాకెట్లలో ఓటు హక్కు వినియోగించుకున్న విశ్వ కుటుంబ సభ్యులు

రాకెట్ల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, సతీమణి వై.భువనేశ్వరి, సోదరుడు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, మంజుల, యువనేత వై.ప్రణయ్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలించి, ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో ఉన్న ఓటర్లను పలకరించారు.

బారులు తీరిన ఓటర్లు

బెళుగుప్ప: మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని 43 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి స్వల్ప ఉద్రిక్తతల మధ్య పోలింగ్ కొనసాగింది. మండలంలో మొత్తం 36,043 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 17,829 మంది, మహిళా ఓటర్లు 18,182 మంది ఉన్నారు. మండలంలోని గుండ్లపల్లి, వెంకటాద్రిపల్లి, విరుపాపల్లి, కోనంపల్లి గ్రామాల్లో రాత్రి అయినా పోలింగ్ కొనసాగిందని తహసీల్దార్ హరినాథ్‌రావు తెలిపారు.

వజ్రకరూరు: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం రాత్రి దాకా కొనసాగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 9గంటల వరకు సాగింది. ఉదయాన్నే ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. మండల వ్యాప్తంగా 51 పోలింగ్ స్టేషన్లలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. ఎన్నికల పోలింగ్‌ను ఎంపీడీఓ విజయలలిత పర్యవేక్షించారు. ఉరవకొండ సీఐ ప్రవీణ్‌కుమార్, వజ్రకరూరు ఎస్‌ఐ నరేష్ తదితరులు పర్యవేక్షించారు.

విడపనకల్లు: మండలం వ్యాప్తంగా పాల్తూరు, కరకముక్కల, వేల్పుమడుగు, హావళిగి, పొలికి వి.కొత్తకోట, గడేకల్లు తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా ముగిసాయి. విడపనకల్లు వి.కొత్తకోట, పాల్తూరు,డొనేకల్లు గ్రామాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆర్.కొట్టాల,విడపనకల్లు,వి.కొత్తకోటలో చెదురుమొదురు ఘర్షణలు మినహా ప్రశాంతంగా జరిగింది. గడేకల్లు డోనేకల్లులో ఎంపీపీ కరణం పుష్పావతి, భీంరెడ్డి, జెడ్పీటీసీ హనుమంతు కూడా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.


కోనంపల్లి పోలింగ్ కేంద్రంలో సహాయకుల సాయంతో ఓటువేయడానికి వచ్చిన వృద్ధురాలు


నెరిమెట్ల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కోసం క్యూ లైన్లో నిల్చున్న మహిళలు


కరకముక్కల్లో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు


బెళుగుప్పలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

క్లుప్తంగా

జోడు లింగాల ఆలయంలో విశ్వ పూజలు


కూడేరు: వై.విశ్వేశ్వర రెడ్డిని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకుడు

కూడేరు: ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డి సతీమణి భువనేశ్వరి, తనయుడు ప్రణయ్‌రెడ్డితో కలిసి కూడేరు శివ పార్వతుల స్వయంభు జోడులింగాల సంగమేశ్వరాలయంలో సోమవారం పూజలు చేశారు. జోడు లింగాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఎన్నికల్లో గెలుపొందేలా చూడాలని స్వామిని వేడుకున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ మూకల దాడి

గుత్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. వివరాలు.. గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ టీడీపీ కార్యకర్తలు, కొందరు అల్లరి మూకలను వెంట వేసుకుని పోలింగ్ కేంద్రం ఆవరణలోకి చొరబడ్డాడు. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ప్రచారం నిర్వహించారు. దీంతో గుంతకల్లు ఎమ్మెల్యే అల్లుడు మంజునాథ్‌రెడ్డి, పార్టీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ పీరా అభ్యంతరం తెలిపారు. దీంతో టీడీపీ మూకలు రెచ్చిపోయి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడికి పాల్పడ్డాయి. సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బంది ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించివేశారు. టీడీపీ శ్రేణుల కవ్వింపు చర్యలతో ఓటర్లు భయాందోళనకు గురయ్యారు.

కొనకొండ్లలో ఓటు వేసిన శివరామిరెడ్డి



వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఓటు వేసిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలోని 58వ బూత్‌లో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయమే క్యూలో నిల్చొని ఓటు వేశారు. అనంతరం ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. సమస్యలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీతోపాటు ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డికూడా ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

కూడేరులో గొడవకు దిగిన టీడీపీ నాయకులు


కూడేరు: వైఎస్సార్ సీపీ నేతలతో గొడవకు దిగిన టీడీపీ నేతలు

కూడేరు: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం సమీపంలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న కార్యకర్తలపై టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు. ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న వారు వలంటీర్లుగా భావించి, సెల్‌ఫోన్‌లో చిత్రించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు కలగజేసుకొని వాస్తవాలు తెలుసుకోవాలని, వారంతా వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేశారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు వచ్చి అక్కడ గుంపులు లేకుండా పంపించివేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకుల దాడి


కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాయకులు

ఉరవకొండ (బెళుగుప్ప): మండలంలోని బెళుగుప్పలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడి చేసి పోలింగ్ కేంద్రాల సమీపంలోనే అల్లర్లకు పాల్పడ్డారు. బెళుగుప్పలో బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, నాయకులు బాబురెడ్డి, హరిజన పెద్దన్నపై మూకుమ్మడిగా దాడి చేశారు. బెళుగుప్పకు చెందిన టీడీపీ నాయకుడు పెద్దతిప్పయ్య, బాలాజీ, గుడిసిలి ఎర్రిస్వామి, సాయితేజ, అఖిల్, ప్రదీప్, రత్నమ్మ, వన్నూరస్వామి, వంశీ తదితరులు వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేశారు. దాడుల్లో గాయపడిన వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులు ఘటనను ఖండించారు.